

ఒక్క అవకాశమివ్వండి

తనకు అవకాశం ఇస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని ఎల్లారెడ్డి కాంగ్రెస్ అభ్యర్థి మదన్‌మోహన్‌రావు పేర్కొన్నారు.

- 11లో ▸



కల్యాణం.. కమనీయం..

భీమ్‌గల్‌లోని లింబాద్రి గుట్టపై బుధవారం లక్ష్మీనృసింహుల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు.

- 10లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 35.8 /18.5

ఉదయం శీతల గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది. చలి తీవ్రత కాస్త తగ్గవచ్చు.

న్యూస్‌రీల్

బంగారం ధర పైపైకి..!

- 10 గ్రాములకు రూ.63,700

సాక్షి, కామారెడ్డి: బంగారం ధరలు మరోసారి భగ్గుమన్నాయి. బుధవారం మార్కెట్‌లో పది గ్రాముల బంగారం ధర రూ.63,700 లకు చేరింది. ఇటీవలి కాలంలో తగ్గినట్టే తగ్గిన ధర ఒక్కసారిగా భారీగా పెరిగింది. పెళ్లిళ్ల సీజన్‌లో ధరలు పెరగడంతో కొనుగోలుదారులు ఆందోళన చెందుతున్నారు.

రేపు రేవంత్, ఈటల రోడ్‌షోలు





సాక్షి, కామారెడ్డి: ఎన్నికల ప్రచారం చివరి దశకు చేరుకుంటోంది. దీంతో ప్రధాన పార్టీల నేతలు జోరు పెంచారు. ఎన్నికల ప్రచార సభలు, రోడ్‌షోలకు ప్లాన్ చేశారు. శుక్రవారం పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి కామారెడ్డి నియోజక వర్గంలో పర్యటించనున్నారు. ఆయన దోమకొండ, బీబీపేట మండల కేంద్రాల్లో రోడ్‌షోలలో పాల్గొంటారు. అనంతరం కామారెడ్డి పట్టణంలో పలు సంఘాలతో సమావేశమవనున్నారు.

బీజేపీ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ జుక్కల్ నియోజకవర్గానికి రానున్నారు. శుక్రవారం పిట్లం మండలంలోని వారాంతపు సంతలో నిర్వహించే ఎన్నికల ప్రచార కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం పిట్లంలో రోడ్‌షో, గడప గడపకు బీజేపీ కార్యక్రమాలలో ఈటల పాల్గొంటారని ఆ పార్టీ నేతలు తెలిపారు.

నేడు విజయశాంతి రాక



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని క్లాసిక్ ఫంక్షన్ హాల్‌లో గురువారం నిర్వహించే నియోజకవర్గ పద్మశాలీల ఆత్మీయ సమ్మేళనంలో సినీ నటి విజయశాంతి పాల్గొననున్నారు. ఈ విషయాన్ని జిల్లా పద్మశాలి సంఘం సహాయ కార్యదర్శి శ్రీనివాస్, జాతీయ చేనేత ఐక్యవేదిక కార్యదర్శి వెంకటనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో విజయశాంతితోపాటు పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి, మాజీ మంత్రి షబ్బీర్ అలీ పాల్గొంటారని పేర్కొన్నారు.

పత్తి కొనుగోళ్లు షురూ




మద్నూర్: పత్తి రైతులు సీసీఐ ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలోనే పంటను విక్రయించాలని జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి రమ్య సూచించారు. మండల కేంద్రంలోని గురు రాఘవేంద్ర పత్తి ఫ్యాక్టరీలో బుధవారం సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పత్తి క్వింటాలుకు రూ. 7,020 ధర చెల్లిస్తున్నామన్నారు. ఎనిమిది శాతం తేమ వచ్చేటట్టుగా పత్తిని ఎండబెట్టి కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో సీసీఐ అధికారి ఓబుల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ కార్యదర్శి విఠల్, గురురాఘవేంద్ర ఫ్యాక్టరీ యాజమాని శశికాంత్ సేట్ పాల్గొన్నారు.

'పోలింగ్ సిబ్బందికి సౌకర్యాలు కల్పించాలి'



కామారెడ్డి టౌన్: జిల్లాలో ఈనెల 29, 30 తేదీలలో జరిగే ఎన్నికల విధులలో పాల్గొనే సిబ్బందికి తగిన సౌకర్యాలు కల్పించాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ ప్రతినిధులు కోరారు. ఈ విషయమై బుధవారం కలెక్టర్ కార్యాలయ ఏవో సయ్యద్ అహ్మద్ మసూర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సత్యనారాయణ, సీహెచ్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ ఆరు నెలలలోపు రిటైరయ్యే వారికి, అనారోగ్యంతో ఉన్న ఉద్యోగులు, దివ్యాంగులు, గర్భిణులకు ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. ఎన్నికల విధులు ముగించుకొని వచ్చిన ఉద్యోగులకు ఇంటికి చేరుకోవడానికి తగిన రవాణా సౌకర్యం కల్పించాలన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉద్యోగులకు మరుసటి రోజు స్పెషల్ క్యాజువల్ లీవ్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఫెడరేషన్ ప్రతినిధులు ఆంజనేయులు, మచ్చేందర్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీ ఓట్లపై గురి!



- జిల్లా కేంద్రంపై ఫోకస్ చేసిన గులాబీ నేతలు
- బరిలో లేని షబ్బీర్.. అనుకూలంగా మార్చుకుంటున్న బీఆర్ఎస్
- చక్రం తిప్పుతున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు ముజీబొద్దీన్

సీఎం కేసీఆర్ పోటీ చేస్తుండడంతో ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న బీఆర్ఎస్ నేతలు.. వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. కాంగ్రెస్ నుంచి షబ్బీర్ అలీ బరిలో లేకపోవడాన్ని అనుకూలంగా మలచుకుంటున్న గులాబీ దళం.. మైనారిటీ ఓట్లపై దృష్టి సారించింది. ఆ పార్టీ మైనారిటీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ముజీబొద్దీన్ చక్రం తిప్పుతూ ముస్లింల మద్దతు కూడగట్టేందుకు ప్రయత్నిస్తున్నారు.

జంగ్ తెలంగాణ

సాక్షి, కామారెడ్డి: కామారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గంలో మైనారిటీ ఓట్లపై అధికార బీఆర్ఎస్ ఫోకస్ చేసింది. జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, పార్టీ మైనారిటీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంకే ముజీబొద్దీన్ మైనారిటీలను తమవైపు తిప్పుకునేందుకు చక్రం తిప్పుతున్నారు. ఇప్పటికే మైనారిటీలు చాలా వరకు బీఆర్ఎస్‌లో చేరారు.

కామారెడ్డి పట్టణంలో భారీగా ఉన్న మైనారిటీల ఓట్లపై బీఆర్ఎస్ నేతలు దృష్టి సారించారు. సీఎం కేసీఆర్ బరిలో ఉండడంతో ఎన్నికల షెడ్యూల్ వెలువడకముందే ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, పార్టీ మైనారిటీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంకే ముజీబొద్దీన్ రంగంలోకి దిగారు. ఆరువందలకుపైగా ముస్లిం మహిళలకు కుట్టుమిషన్లను పంపిణీ చేశారు. అలాగే మైనారిటీ బంధు ద్వారా ఒక్కొక్కరికీ రూ.లక్ష చొప్పున వందలాది మందికి ప్రయోజనం కల్పించారు.

షబ్బీర్ అలీ లేకపోవడంతో..

మాజీ మంత్రి షబ్బీర్ అలీ.. దశాబ్దాలుగా జిల్లా కాంగ్రెస్‌కు పెద్ద దిక్కుగా ఉంటూ వస్తున్నారు. 1989 నుంచి ఆయన కామారెడ్డి అసెంబ్లీ స్థానంలో పోటీ చేస్తున్నారు. ఇక్కడ మైనారిటీలు ఆయనకు మద్దతుగా ఉన్నారు. అయితే ఆయన ఈసారి కామారెడ్డి నుంచి కాకుండా నిజామాబాద్ అర్బన్ స్థానం నుంచి పోటీ చేస్తున్నారు. దీంతో ఇన్నాళ్లూ షబ్బీర్ అలీ వెంట ఉన్న మైనారిటీల ఓట్లు కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల మధ్య చీలిపోతాయని భావిస్తున్నారు.

ముజీబొద్దీన్ మంత్రాంగం..

ముస్లిం ఓట్లను కూడగట్టేందుకు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబొద్దీన్ తీవ్రంగా కృషి చేస్తున్నారు. మైనారిటీ వర్గాలతో సమావేశమవుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, బీఆర్ఎస్ పాలనలో మైనారిటీలకు జరిగిన మేలును వివరిస్తున్నారు. మజీద్‌లు, దర్గాల అభివృద్ధికి నిధులు భారీగా కేటాయించిన విషయాన్ని గుర్తు చేస్తూ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు అండగా నిలవాలని కోరుతున్నారు. దీంతో ఇప్పటివరకు షబ్బీర్ అలీ వెంట నడిచిన మైనారిటీలు క్రమంగా ముజీబొద్దీన్ వైపు మళ్లుతున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

కాంగ్రెస్ ఓటు బ్యాంకుపై దృష్టి..

కామారెడ్డి పట్టణంలో మైనారిటీలు దశాబ్దాలుగా కాంగ్రెస్‌కు ఓటుబ్యాంకుగా కొనసాగుతూ వచ్చారు. అయితే ఇటీవలి కాలంలో మైనారిటీలు బీఆర్ఎస్ వైపు మళ్లుతుండడంతో కాంగ్రెస్ ఓటు బ్యాంకుకు దెబ్బ తగులుతుందని భావిస్తున్నారు. కామారెడ్డి పట్టణంలో మైనారిటీలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో రోజూ కొందరితో సమావేశం అవుతూ వారిని బీఆర్ఎస్ వైపు తిప్పడంలో ముజీబొద్దీన్ చాలా వరకు సక్సెస్ అయ్యారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. షెడ్యూల్‌కు ముందు ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల లబ్ధిపొందిన వారు చాలావరకు బీఆర్ఎస్ వైపు మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. దీంతో బీఆర్ఎస్ నిర్వహించిన సమావేశాలకు ముస్లింలు భారీగానే హాజరవుతున్నారు. ఇటీవల హోంమంత్రి మహమూద్ అలీ నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ముస్లింలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఇందూరు ఎటుంటే రాష్ట్రం అటే..



ధర్పల్లి సభలో మాట్లాడుతున్న పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, పక్కన అభ్యర్థి భూపతిరెడ్డి

- ఉమ్మడి జిల్లా నుంచి కాంగ్రెస్‌కు ఎక్కువ సీట్లివ్వాలి
- కవితను ఓడించడంతో జిల్లాపై కేసీఆర్ కక్షగట్టారు
- దోపిడీ దొంగలను సాగనంపాలి..
- ధర్పల్లి బహిరంగసభలో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి

ధర్పల్లి : ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ప్రజలు ఏవైపు ఉంటే రాష్ట్రంలో ఆ పార్టీనే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లా నుంచి కాంగ్రెస్‌కు అత్యధిక సీట్లు ఇవ్వాలని కోరారు. బుధవారం నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని ధర్పల్లిలో ఆ పార్టీ అభ్యర్థి రేకులపల్లి భూపతిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన బహిరంగసభలో రేవంత్ పాల్గొని ప్రసంగించారు. పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రజలకు ఇచ్చిన హామీలను గాలికొదిలేసిందన్నారు. నిజాం షుగర్స్‌ను తెరిపించలేదని, పోడు భూములకు పట్టాలివ్వలేదని, మంచిప్ప ముంపు బాధితులతో మాట్లాడలేదని, పసుపు, ఎర్రజొన్న, సోయాకు గిట్టుబాటు ధరలు కల్పించలేదన్నారు. అధికారంలోకి రాగానే రైతులకు ఏకకాలంలో రుణమాఫీ చేస్తామని, పసుపు, ఎర్రజొన్నలకు గిట్టుబాటు ధర కల్పిస్తామని, పోడు భూములకు పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చారు.

బీఆర్ఎస్ పాలనలో రైతులకు ఒరిగిందేమీ లేదని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. దీంతో గత పార్లమెంట్ ఎన్నికల్లో జిల్లా ప్రజలు కవితను ఓడిస్తే కక్షగట్టిన కేసీఆర్ జిల్లాకు ఏమీ చేయకుండా ద్రోహం చేశారన్నారు. కాంగ్రెస్‌కు 20 సీట్లు కూడా రావని కేసీఆర్ మతితప్పి మాట్లాడుతున్నారన్నారు. కాంగ్రెస్‌కు కచ్చితంగా 80 సీట్లు వస్తాయన్నారు. పంజాబ్, హర్యానా రైతుల మాదిరిగా ఆత్మగౌరవంతో బతికే నిజామాబాద్ జిల్లా రైతులు కేసీఆర్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక నిజాం షుగర్స్‌ను తెరిపిస్తామన్నారు. ప్రాణహిత-చేవెళ్ల డిజైన్ మేరకు మంచిప్ప జలాశయం పూర్తి చేసి సాగునీరు అందిస్తామన్నారు. కాంగ్రెస్‌కు అధికారమిస్తే పింఛన్ రూ.4వేలు ఇస్తామన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా ఆడబిడ్డలకు రూ.2,500 అందిస్తామన్నారు. కేసీఆర్ మాదిరిగా డబుల్ బెడ్‌రూం అంటూ ఊహాప్రపంచం చూపకుండా ఇల్లు కట్టుకునేందుకు రూ.5 లక్షలు ఇస్తామన్నారు.

ప్రజాసమస్యలు గాలికి వదిలేశారు..

రూరల్ ఎమ్మెల్యేగా ఉన్న బాజిరెడ్డి ప్రజాసమస్యలను గాలికొదిలేసి తాను మాత్రం రూ. వేల కోట్ల ఆస్తులు సంపాదించుకున్నారని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ఆర్టీసీ చైర్మన్‌గా వ్యవహరించిన బాజిరెడ్డి ఆర్టీసీ కార్మికుల విషయంలో నిర్లక్ష్యం వహించారన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఆర్టీసీ కార్మికులే కీలకంగా ఉన్నారని, ఇలాంటి 60వేల మంది ఆర్టీసీ కార్మికుల సమస్యలను నిర్లక్ష్యం చేసి డీజిల్ అమ్మకాల్లో కమీషన్ల కోసం కక్కుర్తిపడ్డారని ఆరోపించారు. ఆర్టీసీ కార్మికులు, పసుపు, సోయా రైతులు సమస్యలపై కొట్లాడితే అక్రమ కేసులు పెట్టించారన్నారు. సమావేశంలో మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, పీసీసీ ఉపాధ్యక్షుడు తాహెర్‌బిన్ హందాన్, పీసీసీ ప్రధాన కార్యదర్శి నగేష్‌రెడ్డి, బాడ్సి శేఖర్‌గౌడ్, ముప్ప గంగారెడ్డి, గడ్కోల్ భాస్కర్, అరికెల నర్సారెడ్డి, ఆకుల లలిత, మునిపల్లి సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పూర్తి అవగాహన కలిగి ఉండాలి



శిక్షణను పరిశీలిస్తున్న ఎన్నికల అధికారులు

కామారెడ్డి క్రైం: పోలింగ్ ప్రక్రియపై పీవోలు, ఏపీవోలు, ఓపీవోలకు పూర్తి స్థాయిలో అవగాహన ఉండాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ పేర్కొన్నారు. కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాస్టర్ ట్రైనీల ఆధ్వర్యంలో పీవోలు, ఏపీవోలకు ఇస్తున్న రెండో విడత శిక్షణను ఆయన ఎన్నికల సాధారణ పరిశీలకులు ఛిఫంగ్ అర్థుర్ వర్చ్యాయోతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గతంలో ఎన్నికల విధులు నిర్వర్తించిన వారు సైతం శిక్షణ తరగతులను తేలికగా తీసుకోవద్దన్నారు. పోలింగ్ జరుగుతున్నపుడు యంత్రాల్లో సాంకేతిక సమస్యలు తలెత్తితే వెంటనే సెక్టోరల్ అధికారి దృష్టికి తీసుకువెళ్లాలనానరు. బ్యాలెట్ యూనిట్ల సెట్టింగ్‌ను తనిఖీ చేసుకోవాలన్నారు. పోలింగ్ సజావుగా జరిగేలా చూడాలన్నారు. అనంతరం పీవోలు, ఏపీవోలు పోస్టల్ బ్యాలెట్ సదుపాయం వినియోగించుకునేందుకు వీలుగా ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌ను పరిశీలించారు.

'పక్కాగా ఏర్పాట్లు చేస్తున్నాం'



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ పాటిల్

కామారెడ్డి క్రైం: జిల్లాలో ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను పక్కాగా చేస్తున్నామని కలెక్టర్ జితేష్ వి పాటిల్ పేర్కొన్నారు. ఎన్నికల ఏర్పాట్లపై బుధవారం కేంద్ర సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితీష్ కుమార్ వ్యాస్ ఢిల్లీ నుంచి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. పోలింగ్ నిర్వహణ, ఓటరు గుర్తింపు కార్డులు, ఓటరు సమాచార స్లిప్పుల పంపిణీ, బ్యాలెట్ పత్రాల ముద్రణ, హోం ఓటింగ్, పోలింగ్ సిబ్బందికి శిక్షణ, రిసెప్షన్, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల ఏర్పాటు తదితర అంశాలపై పలు సూచనలు ఇచ్చారు. అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ఓటర్లందరికీ ఓటరు సమాచార స్లిప్పులతోపాటు ఓటరు గైడ్, సి-విజిల్ యాప్ కరపత్రాలను పంపిణీ చేస్తున్నామన్నారు. జుక్కల్ నియోజకవర్గంలో 17 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారని, అక్కడ రెండు బ్యాలెట్ యూనిట్లు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. కామారెడ్డి నియోజకవర్గంలో 39 మంది అభ్యర్థులకుగాను మూడు బ్యాలెట్ యూనిట్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అదనంగా అవసరమైన బ్యాలెట్ యూనిట్లను ప్రత్యేక ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించామన్నారు. ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు రెండో విడత శిక్షణ పూర్తయ్యిందన్నారు. జిల్లాలోని వృద్ధులు, దివ్యాంగుల కోసం మంగళ, బుధవారాలలో హోమ్ ఓటింగ్ నిర్వహించామన్నారు. జిల్లాలో ఎన్నికల ఏర్పాట్లు, తీసుకుంటున్న భద్రత చర్యలపై ఉన్నతాధికారికి వివరించారు. వీసీలో జిల్లానుంచి అదనపు కలెక్టర్ చంద్రమోహన్, డీపీవో శ్రీనివాస్ రావు, డీఎల్‌పీవో సాయిబాబా, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

కేసీఆర్‌తో మరింత అభివృద్ధి

- కామారెడ్డినుంచి పోటీ చేయాలని నేనే కోరా
- బీఆర్ఎస్ గెలుపు పక్కా.. భారీ మెజారిటీయే లక్ష్యం
- 'సాక్షి' ఇంటర్వ్యూలో ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్



"తెలంగాణ ఉద్యమంలో కామారెడ్డి ప్రాంత ప్రజలు కేసీఆర్ అడుగులో అడుగేసింద్రు. ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్ష నెరవేరేదాకా కొట్లాడింద్రు. రాష్ట్రమొచ్చిన తర్వాతా ఆయన వెంటే నడిసింద్రు. ఇప్పుడు ఉద్యమ నాయకుడే తమ దగ్గరికి రావడంతో ప్రజలెంతో సంతోషిస్తున్రు. ఏ ఊరికి వెళ్లినా బీఆర్ఎస్‌కు బ్రహ్మరథం పడుతున్రు. కేసీఆర్‌ను భారీ మెజారిటీతో గెలిపిస్తామని మాట ఇస్తుండ్రు'' అని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ పేర్కొన్నారు. బుధవారం 'సాక్షి' గంప గోవర్ధన్‌ను ఇంటర్వ్యూ చేసింది. ఆ వివరాలు..

సాక్షి ఇంటర్వ్యూ

సాక్షి, కామారెడ్డి: కామారెడ్డి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి ఎంతో శ్రమించా. జిల్లా ఏర్పాటు కావడం, మెడికల్ కాలేజీ రావడం.. ఇవన్నీ సీఎం కేసీఆర్ సహకారంతో సాధ్యమయ్యాయి. సిద్దిపేట, సిరిసిల్ల, గజ్వేల్ తరహాలో కామారెడ్డిలో కూడా మరింత అభివృద్ధి జరగాలన్న ఆకాంక్షతో ఇక్కడినుంచి పోటీ చేయాలని సీఎం కేసీఆర్‌ను కోరా. కామారెడ్డి నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలన్నదే తన లక్ష్యం. నా అభ్యర్థనను కేసీఆర్ స్వీకరించి పోటీకి సరే అన్నారు. దీనికి ప్రజల నుంచి మంచి స్పందన వచ్చింది. అందరూ నా నిర్ణయాన్ని అభినందించారు.

లబ్ధిపొందని ఇల్లు లేదు..

కేసీఆర్ సారథ్యంలోని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశంలో మరెక్కడా లేవు. ప్రతి ఇంటికి ఏదో ఒక పథకం ద్వారా లబ్ధి జరిగింది. కొన్ని కుటుంబాలకు నాలుగైదు పథకాలు అందాయి. మంత్రి కేటీఆర్ చెప్పినట్టు హనుమంతుని విగ్రహం లేని ఊరు లేదు, కేసీఆర్ సంక్షేమ పథకాలు అందని ఇళ్లు లేవు. సంక్షేమ పథకాలతో ప్రయోజనం పొందిన వారంతా కేసీఆర్‌కే మా ఓటు అంటున్నారు. కచ్చితంగా భారీ మెజారిటీ సాధిస్తాం.

పసలేని ఆరోపణలు..

ఓడిపోతామన్న భయంతో ప్రత్యర్థులు అబద్ధాలు, తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు. వాళ్లేం చేస్తారో చెప్పకుండా బట్టకాల్చి మీద వేసే ప్రయత్నం చేస్తున్నారు. భూములు గుంజుకుంటారనే తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఎవరి భూమి ఏడికీ పోదన్న విషయం ప్రజలకు తెలుసు. కానీ కొందరు తప్పుడు ప్రచారంతో గందరగోళానికి గురిచేస్తున్నారు. వాటన్నింటినీ తిప్పికొడతాం.

కేడర్‌లో జోష్..

ఏ ఊరికి వెళ్లినా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. కళ్ల ముందు కనిపిస్తున్న అభివృద్ధిని చూసి కార్యకర్తలు, నాయకు లు కూడా ధైర్యంగా ప్రజల్లోకి వెళుతున్నారు. ఏ ఇంటికి వెళ్లినా ప్రజలు ఆశీర్వదిస్తున్నారు. ఓటు వేస్తామని భరోసా ఇస్తున్నారు. కొన్నిచోట్ల అయితే ఊళ్లకు ఊళ్లే ఏకగ్రీవంగా తీర్మానాలు చేశాయి. మంత్రి కేటీఆర్ దిశానిర్దేశంతో పార్టీ నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వ యం చేసుకుంటూ ప్రచారంలో దూసుకుపోతున్నాం. సీఎం కేసీఆర్ పోటీ చేస్తుండడంతో పార్టీ కేడర్ నూతనోత్సాహంతో పనిచేస్తోంది. కామారెడ్డిలో సీఎం కేసీఆర్ గెలవడం పక్కా. ఆయనను భారీ మెజారిటీతో గెలిపించడానికి ప్రచారం చేస్తున్నాం.

ఊహించని అభివృద్ధి జరుగుతుంది

కామారెడ్డి నియోజకవర్గంలో ప్రతీ ఊరు గురించి సీఎం కేసీఆర్‌కు అవగాహన ఉంది. ఏ ప్రాంతానికి ఏం కావాలన్న దానిపై ఇప్పటికే ప్రణాళిక రూపొందించుకున్నారు. ఆయన కామారెడ్డి ఎమ్మెల్యేగా గెలిచాక నియోజకవర్గానికి భారీ ఎత్తున నిధులు వస్తాయి. ఇప్పటికే మెడికల్ కాలేజీ ఏర్పాటుతో వైద్య విద్య అందుబాటులోకి వచ్చింది. సూపర్ స్పెషాలిటీ వైద్యం అందనుంది. ఇంకా ఎన్నో కాలేజీలు రానున్నాయి. ఈ ప్రాంతంలో ఊహించనంత అభివృద్ధి జరుగుతుంది.

'రేవంత్‌రెడ్డి చంద్రబాబు మనిషి'



మాట్లాడుతున్న కొమ్ముల తిర్మల్‌రెడ్డి

భిక్కనూరు: పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మనిషని ఫుడ్ కమిషన్ మాజీ చైర్మన్ కొమ్ముల తిర్మల్‌రెడ్డి విమర్శించారు. బుధవారం ఆయన భిక్కనూరులో విలేకరులతో మాట్లాడారు. స్థానిక కాంగ్రెస్ నేతలను రేవంత్‌రెడ్డి బంధువులు చిన్నచూపు చూస్తున్నారని, ఇప్పుడే ఇలా ఉంటే ఒకవేళ అధికారంలోకి వస్తే వారి ఆగడాలకు అడ్డూఅదుపూలేకుండా పోతుందని పేర్కొన్నారు. ఓటుకు నోటు కేసులో నిందితుడిగా ఉన్న రేవంత్‌రెడ్డి తెలంగాణ సాధన కోసం ప్రాణత్యాగానికి సైతం సిద్ధపడ్డ కేసీఆర్‌ను విమర్శించడం శోచనీయమన్నారు. బీజేపీ అభ్యర్థి వెంకటరమణారెడ్డి కుల సంఘాలను డబ్బులతో ప్రలోభపెట్టి ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కుతున్నాడన్నారు. లోకల్ -నాన్‌లోకల్ అంటూ విభజింపచేస్తున్నాడని, ఆయన కూడా ఎల్లారెడ్డి నియోజకవర్గానికి చెందిన వ్యక్తే అని గుర్తుంచుకోవాలని పేర్కొన్నారు. సమావేశంలో ఎంపీపీ గాలిరెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నర్సింహారెడ్డి, సర్పంచ్ తున్కి వేణు, విండో చైర్మన్ గంగళ్ల భూమయ్య, నాయకులు వంగేటి చిన్ననర్సరెడ్డి, బోడ నరేష్, రాంచంద్రం, పురాం రాజమౌళి, సత్యనారాయణ, మల్లేషం తదితరులు పాల్గొన్నారు.

FORMAT C-1
(FOR CANDIDATE TO PUBLISH IN NEWSPAPERS, TV)

Declaration about Criminal Cases

[As per the judgment dated 25th September, 2018 of Hon'ble Supreme Court in WP (Civil) No. 536 of 2011 (Public Interest Foundation & Ors. Vs. Union of India & Anr.)]

Name and address of Candidate : SURENDAR JAJALA H.NO. 2-52/3, NALLAMADUGU VILLAGE & POST LINGAMPET MANDAL, KAMAREDDY DISTRICT.
Name of Political Party : BHARAT RASHTRA SAMITHI
Name of Election : GENERAL ELECTION TO TELANGANA LEGISLATIVE ASSEMBLY - 2023
Name of Constituency : 15 - YELLAREDDY

I, SURENDAR JAJALA (Name of the Candidate), a candidate for the above mentioned election, declare for public information the following details about my criminal antecedents:

(A) Pending Criminal Cases

Sl. No.	Name of Court	Case No. and dated	Status of case(s)	Section(s) of Acts Concerned & brief description of offence(s)
1.	CC No: 166/217 AJFCM KMR	FIR No.21/2017 P.S.Devunipally, Kamareddy - 503111	-Pending-	U/s. 341, 143 R/w 34 IPC Unlawful Assemble at District Collectorate, Kamareddy.

(B) Details about cases of conviction for criminal offences

Sl. No.	Name of Court & date(s) of order(s)	Description of Offence(s) & punishment Imposed	Maximum Punishment Imposed
-NA-	-NA-	-NA-	-NA-

క్లుప్తంగా

రక్తదానంతో ఇతరులకు ప్రాణదానం

తెయూ(డిచ్‌పల్లి): రక్తదానంతో ఇతరుల ప్రాణాలను కాపాడవచ్చని తెయూ రిజిస్ట్రార్ యాదగిరి అన్నారు. తెయూ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ 1, 2, 3, 4 వలంటీర్లు రక్తదాన శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. తలసేమియా వ్యాధిగ్రస్తులకు సాయంగా వలంటీర్లు రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆరతి, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ రవీందర్‌రెడ్డి, చీఫ్ వార్డెన్ మహేందర్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ స్రవంతి, స్వప్న, సిబ్బందిపాల్గొన్నారు.

రూరల్ డెవలప్‌మెంట్ సిద్ధాంత గ్రంథం ఆవిష్కరణ



తెయూ(డిచ్‌పల్లి): నగరంలోని ఆలిండియా రేడియో స్టేషన్‌లో క్యాజువల్ అనౌన్సర్‌గా పనిచేస్తున్న సింగారం శ్రీనివాస్ రచించిన 'రేడియో–రూరల్ డెవలప్‌మెంట్' సిద్ధాంత గ్రంథాన్ని తెయూ సోషల్ సైన్ డీన్, ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంటా చంద్రశేఖర్ బుధవారం ఆవిష్కరించారు. గ్రంథాన్ని రచించిన శ్రీనివాస్‌ను చంద్రశేఖర్ అభినందించారు. ఇప్పటికీ రూరల్ డెవలప్‌మెంట్ అంశంలో రేడియో ముఖ్యపాత్ర పోషిస్తుందన్నారు. కార్యక్రమంలో నిజామాబాద్ రేడియో స్టేషన్ ప్రోగ్రామ్స్ ఎగ్జిక్యూటివ్ సుర్యప్రకాశ్, డ్యూటీ ఆఫీసర్ మోహన్‌దాస్, ఇంజినీరింగ్ సిబ్బంది, వాఖ్యాతలు పాల్గొన్నారు.

ఐక్యూఏసీ డైరెక్టర్‌గా అడికె నాగరాజు



తెయూ(డిచ్‌పల్లి): తెయూ ఐక్యూఏసీ డైరెక్టర్‌గా కెమిస్ట్రీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ అడికె నాగరాజు నియామకమయ్యారు. తెయూ ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ యాదగిరి నాగరాజుకు నియామక ఉత్తర్వులను బుధవారం అందజేశారు. అనంతరం నాగరాజును అధ్యాపకులు బాలకిషన్, సాయిలు అభినందించారు.

ఓటు వేయండి.. రాయితీ పొందండి



ఆర్మూర్‌టౌన్: ఓటు హక్కును వినియోగించుకోవడానికి ప్రభుత్వంతో పాటు ప్రైవేటు సంస్థలు బాధ్యాతయుతంగా వ్యవహరిస్తున్నాయి. ఆర్మూర్ పట్టణంలోని దేవీ ఫ్యామిలీ రెస్టారెంట్ వారు ఓటు హక్కు వినియోగించుకున్నవారికి ప్రత్యేక రాయితీ సౌకర్యం కల్పిస్తున్నారు. ఓటు హక్కు వినియోగించుకున్నవారికి తమ రెస్టారెంట్‌లో అన్ని రకాల పసందైన వంటకాలపై 10 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు యజమానులు చుక్కల నరేశ్, చుక్కల సురేశ్ తెలిపారు.

ఎడపల్లి ఘటనలో మూడు పార్టీలపై కేసులు..?

ఎడపల్లి (బోధన్) : ఎడపల్లి మండలం సాటాపూర్ గేట్ వద్ద జరిగిన ఘటనపై బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ నేతలపై పోలీసులు కేసులు నమోదు చేసినట్లు తెలిసింది. ఎడపల్లి పోలీస్ స్టేషన్‌లో ఇరు వర్గాల చెందిన ఫిర్యాదు మేరకు 15 మందిపై కేసు నమోదుకు రంగం సిద్ధం చేసినట్లు తెలిసింది. దీంతో బోధన్ నియోజకవర్గంలో సాటాపూర్ వద్ద జరిగిన చర్చనీయాంశంగా మారింది. బీఆర్‌ఎస్ శ్రేణులు పోలీసులు ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ పార్టీ నేతలు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుతో పాటు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల తీరుపై రేవంత్ రెడ్డి సీరియస్ అయిన విషయం తెలిసిందే. ఈ కేసు విషయమై ఏసీపీ కిరణ్‌కుమార్ ఎస్సైలను ఫోన్‌లో వివరణ కోరేందుకు ప్రయత్నించగా వారు స్పందించలేదు.

బీఆర్‌ఎస్ పథకాలు దేశానికే ఆదర్శం

- కుల సంఘాలకు బీజేపీ ఇచ్చే పైసలు తీసుకొని ఓటు కారుకు వేయాలి
- ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్

బీబీపేట: సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశానికే స్ఫూర్తిదాయకమని, ప్రతి రాష్ట్రం మన పథకాలను కాపీ కొడుతోందని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ అన్నారు. బుధవారం ఉప్పర్‌పల్లి, ఇస్సానగర్, మల్కాపూర్, తుజాల్‌పూర్, శేరి బీబీపేట గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించి మాట్లాడారు. కాంగ్రెస్, బీజేపీలకు ఓటేస్తే అంధకారం అవుతుందని, బీబీపేట మండలాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేసింది కేసీఆర్ ప్రభుత్వమేనని అన్నారు. బీజేపీ నాయకుడు మహిళా దినోత్సవాన్ని చూసుకొని ధర్నాలు, రాస్తారోకోలు చేసి చెక్కులు ఇప్పించానని చెప్పుకుంటున్నాడని, ప్రతి



మల్కాపూర్‌లో మాట్లాడుతున్న గంప గోవర్ధన్

మహిళా దినోత్సవం రోజున కేసీఆర్ ప్రభుత్వం మహిళలకు చెక్కులు అందజేస్తుందని తెలిసే ఆ పెద్ద మనిషి ఇలా చేస్తున్నాడని ఎద్దేవా చేశారు. ఆలయాలు, సంఘాలకు ఇస్తున్న పైసలు అందరు తీసుకొని కారు గుర్తుకు ఓటేయాలని కోరారు. మూడోసారి ముచ్చటగా కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయమని అన్నారు. కాంగ్రెస్ వస్తే మూడు గంటలు కరెంట్ ఇస్తారని, వారి మాటలు



ఉప్పర్‌పల్లిలో ప్రచారం చేస్తున్న కార్యకర్తలు

నమ్మి మోసపోవద్దని అన్నారు. ఈ ప్రచారంలో ఎన్నికల సమన్వయ కమిటీ సభ్యుడు తిమ్మయ్యగారి సుభాష్‌రెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ ప్రేమ్‌కుమార్, ఎంపీపీ బాలమణి, తదితరులు పాల్గొన్నారు.

12వ వార్డులో మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రచారం



వృద్ధుడితో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవి

కామారెడ్డి టౌన్: పట్టణంలోని 12వ వార్డులో సీఎం కేసీఆర్ తరఫున మున్సిపల్ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవి బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సీఎం కేసీఆర్‌ను గెలిపిస్తే వెయ్యి రెట్లు కామారెడ్డి పట్టణం అభివృద్ధి చేస్తామని ఓటర్లకు హామీ ఇచ్చారు. కౌన్సిలర్ శంకర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి

కామారెడ్డి టౌన్: కామారెడ్డిలో పోటీ చేస్తున్న సీఎం కేసీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు నిట్టు వేణుగోపాల్‌రావు కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలోని 29వ వార్డులో గల గ్లోరియల్ చర్చిలో క్రైస్తవులతో ఆత్మీయ సమావేశం నిర్వహించి మాట్లాడారు. కౌన్సిలర్ అంజాద్, నాయకులు ముప్పారపు ఆనంద్, తదితరులున్నారు.



మాట్లాడుతున్న నిట్టు వేణుగోపాల్‌రావు

దోమకొండలో బీఆర్‌ఎస్ నాయకుల ప్రచారం



ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

దోమకొండ: కామారెడ్డి ఎమ్మెల్యేగా సీఎం కేసీఆర్‌ను గెలిపించాలని కోరుతూ బీఆర్‌ఎస్ నాయకులు బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కేసీఆర్ చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలను వారికి వివరించారు. పార్టీ మండల అధ్యక్షుడు గంద్ర మధుసూదన్‌రావ్, జెడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, ఎంపీపీ కానుగంటి శారద, సీడీసీ చైర్మన్ ఐరేని నర్సయ్య, తదితరులున్నారు.

ప్రజాసేవే ధ్యేయంగా పనిచేస్తా..

- అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి
- బీఆర్‌ఎస్ బాన్సువాడ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డి

రుద్రూర్: ప్రజాసేవే ధ్యేయంగా పనిచేస్తానని, నియోజకవర్గ ప్రజలు తనను ఎన్నికల్లో గెలిపించాలని బీఆర్‌ఎస్ బాన్సువాడ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డి కోరారు. మండలంలోని బొప్పాపూర్, రుద్రూర్ మండల కేంద్రంలో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో పోచారం మాట్లాడుతూ... గ్రామాల్లో ప్రజలు అడిగిన ప్రతి పని చేశానని, రుద్రూర్‌లో రూ.37 కోట్లతో అభివృద్ధి పనులు చేసినట్లు తెలిపారు. ప్రజల సౌకర్యార్థం రుద్రూర్‌ను మండల కేంద్రంగా ఏర్పాటు చేశామన్నారు. స్థానికేతరుల మాయమాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దన్నారు. ప్రజలకు బీఆర్‌ఎస్ మేనిఫెస్టోను వివరించారు. అనంతరం వివిధ కుల సంఘాల సభ్యులు ఏకగ్రీవ తీర్మానప్రతులు స్పీకర్‌కు అందజేశారు. కార్యక్రమాల్లో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పోచారం సురేందర్‌రెడ్డి, జడ్పీటీసీ నరోజీ గంగారాం, ఎంపీపీ సుజాతానాగేందర్, పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు పత్తి లక్ష్మణ్, బాల్‌రాజ్, బోధన్ ఏఎంసీ చైర్మన్ వి. వెంకటేశ్వరరావ్ దేశాయ్, విండో చైర్మన్ సంజీవరెడ్డి, మాజీ చైర్మన్ పత్తి రాము తదితరులు పాల్గొన్నారు.

కడుపులో పెట్టి చూసుకున్నా..

వర్ని: మండల ప్రజలను తన కడుపులో పెట్టి



మాట్లాడుతున్న పోచారం శ్రీనివాస్ రెడ్డి

చూసుకున్నానని ఏ కష్టం రాకుండా అన్నివేళల్లో అండగా ఉంటూ ఆదుకున్నానని బీఆర్‌ఎస్ బాన్సువాడ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మండలంలో ప్రధానంగా వ్యవసాయానికి ప్రత్యేకంగా నిధులు కేటాయించి సిద్ధాపూర్ రిజర్వాయర్ జాకోరా లిఫ్ట్ ఇరిగేషన్ చెరువుల మరమ్మతులకు రూ. కోట్ల నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. ప్రజలు తనకు సమస్యలు వివరించక ముందే తానే తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేసినట్లు తెలిపారు. బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థుల మోసపూరిత మాటలు వినొద్దని కోరారు. ప్రచారంలో జెడ్పీటీసీ హరిదాసు, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు గోపాల్, సర్పంచుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నాని బాబు, పార్టీ మండల అధ్యక్షుడు గిరి, నాయకుడు మేక వీర్రాజు, మండల కో–ఆప్షన్ సభ్యుడు కరీం, సర్పంచులు శ్రీనగర్ రాజు, కన్నీరాం తదితరులు పాల్గొన్నారు.

విజన్ ఉన్న నాయకుడు పోచారం



బోర్లంలో మాట్లాడుతున్న పోచారం భాస్కర్‌రెడ్డి

బాన్సువాడ రూరల్: బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థిగా మరోమారు బాన్సువాడ నుంచి పోటీ చేస్తున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి విజన్ ఉన్న నాయకుడని డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన బోర్లం గ్రామంలో ఎన్నికల ప్రచారం చేసి మాట్లాడారు. బాన్సువాడ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ నియోజకవర్గంగా పోచారం తీర్చిదిద్దారన్నారు. నిరంతరం నియోజకవర్గ అభివృద్ధి కోసం పోచారం పరితపిస్తారని, అందుకే నలభై ఏళ్లుగా ఓట్లు వేసి ఆదరిస్తున్నారన్నారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఎలాంటి అభివృద్ధి చేయకుండా అవినీతి అక్రమాలకు పాల్పడటం వల్లే రవీందర్‌రెడ్డిని అక్కడి ప్రజలు ఓడించారని విమర్శించారు.



ప్రచారం చేస్తున్న పోచారం కూతురు

పోచారం శ్రీనివాస్‌రెడ్డి చేతిలో అరువు అభ్యర్థులకు ఘోర పరాజయం తప్పదన్నారు. పలువురిని పార్టీలోకి ఆహ్వానించారు. నాయకులు మోహన్‌నాయక్, రాజేశ్వర్‌గౌడ్, సర్పంచ్ సరళ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ శ్రావణి దేవేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బాన్సువాడలో జోరుగా ప్రచారం

బాన్సువాడ: పట్టణంలోని ఆయా కాలనీల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డి కూతురు అరుణరెడ్డి, కోడలు సోనిరెడ్డిలు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. పోచారం శ్రీనివాస్‌రెడ్డి చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. కారు గుర్తుకు ఓటేయాలని కోరారు. నాయకులు రమాదేవి, ప్రతిమారెడ్డి, సరిత, వాణి తదితరులు ఉన్నారు.

నా జీతంతో ఆడపడుచులకు చీరలు అందించా

ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్

ఎల్లారెడ్డి: తనకు వచ్చిన జీతంతోనే ఆడపడుచులకు కల్యాణలక్ష్మి పథకం కింద వచ్చిన చెక్కుతో పాటు తన వంతు సహాయంగా చీరలను అందించానని ఎల్లారెడ్డి బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే జాజాల సురేందర్ తెలిపారు. బుధవారం లక్ష్మాపూర్, హాజీపూర్, ఆడివిలింగాల, కొక్కొండ, గండిమాసానిపేట, తిమ్మాపూర్ తదితర గ్రామాలలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. కొక్కొండలో మహిళలు బోనాలతో ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కరోనా సమయంలో ఎంతో మందికి సహాయం అందించానన్నారు. ఎల్లారెడ్డిలో సీసీ రోడ్లు, వంద పడకల ఆస్పత్రి నిర్మాణం, నూతన బస్టాండ్ నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. డయాలసిస్ రోగుల కోసం డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయించానన్నారు. మరో మారు కేసీఆర్‌ను సీఎం చేయాలని.. దీంతో రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. తాను స్థానికుడినని లింగంపేట మండలంలోని



లక్ష్మాపూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జాజాల

నల్లమడుగు గ్రామంలోనే జన్మించి పెరిగి పెద్దవాడినై ఎల్లారెడ్డి నియోజకవర్గ ప్రజలకు సేవే చేసే అవకాశం కల్పించారని అన్నారు. అమెరికాలో ఉండే వ్యక్తికి ఓటు వేసి ఇబ్బందులు పడవద్దని అన్నారు. మాజీ మంత్రి నేరెళ్ల ఆంజనేయులు, ఎమ్మెల్యే జనార్దన్ గౌడ్, గాంధారి ఏఎంసీ చైర్మన్ సత్యంరావు, ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ, తదితరులున్నారు.

ప్రచారాన్ని అడ్డుకున్న గ్రామస్తులు

లక్ష్మాపూర్, హాజీపూర్ గ్రామాలలో పలువురు గ్రామస్తులు ఎమ్మెల్యే జాజాల సురేందర్ ప్రచారాన్ని అడ్డుకున్నారు. ఐదేళ్లలో ఎలాంటి అభివృద్ధి చేయని ఎమ్మెల్యే ప్రస్తుతం ఎందుకు వచ్చారని



పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

ప్రశ్నించారు. అనంతరం ఎమ్మెల్యే వారికి సర్ది చెప్పడంతో ప్రచారాన్ని కొనసాగించారు.

బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): రామక్కపల్లి, లింగంపల్లి కలాన్ గ్రామాలకు చెందిన సుమారు 100 మంది యువకులు కాంగ్రెస్‌ను వీడి బుధవారం బీఆర్‌ఎస్‌లో చేరారు.

ఎల్లారెడ్డిరూరల్/తాడ్వాయి/సదాశివనగర్: ఎమ్మెల్యే జాజాల సురేందర్‌కు ఓటు వేయాలని ఎల్లారెడ్డి, తాడ్వాయి, సదాశివనగర్ మండలాల పరిధిలో బీఆర్‌ఎస్ నేతలు ప్రచారం చేస్తున్నారు. కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు.

28న నిధి ఆప్కేనికట్

నిజామాబాద్ సిటీ : ఈనెల 28న ఉమ్మడి జిల్లాలో నిధి ఆప్కేనికట్ 2.0 కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పీఎఫ్ కమిషనర్ గణేశ్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్మూర్‌లోని వరుణ్ మోటార్స్‌లో, కామారెడ్డి జిల్లా కేంద్రం నిజాంసాగర్ రోడ్డు ఎస్పీఆర్ పాఠశాలలో కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. పీఎఫ్ చందాదారులు, యజమానులు, పెన్షనర్లు తగిన ఆధారాలతో కార్యక్రమానికి హాజరు కావొచ్చన్నారు.

కల్యాణం.. కమనీయం

- వైభవంగా లక్ష్మీ నృసింహస్వామి కల్యాణోత్సవం



తాలి బొట్టును చూపుతున్న అర్చకులు

భీమ్‌గల్: మండలంలోని నింబాచల క్షేత్రంపై బుధవారం లక్ష్మీ నృసింహస్వామి కల్యాణోత్సవం వైభవంగా కొనసాగింది. నింబాచల క్షేత్రంలో ఈ నెల 18 నుంచి ప్రారంభమైన స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ వేడుక నిర్వహించారు. అంతకుముందు ఆలయంలోని మూల విరాట్ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలకు పల్లకీసేవ, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు, నంబి లింబాద్రి కుటుంబీకులు స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు.



స్వామి వారి కల్యాణం



పట్టువస్త్రాలు అందజేస్తున్న అర్చకులు

క్రైం కార్నర్

గజ్జలమ్మ జాతరలో అపశ్రుతి

- విద్యుదాఘాతంతో ఒకరి మృతి
- ముగ్గురికి గాయాలు



మాధవరావు(ఫైల్)

రుద్రూర్: మండలంలోని అంబం(ఆర్) గ్రామంలో కొనసాగుతున్న గజ్జలమ్మ ఉత్సవాల్లో అపశ్రుతి చోటు చేసుకుంది. బుధవారం ఆలయం నుంచి రథం తీసుకెళుతున్న సమయంలో విద్యుదాఘాతంతో ఒకరి మృతి చెందగా ముగ్గురికి గాయాలయ్యాయి. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రతి ఏడాది వానకాలం పంటలు చేతికొచ్చిన తరువాత గజ్జలమ్మ ఉత్సవాలను రెండు రోజుల పాటు నిర్వహిస్తామని తెలిపారు. రెండోరోజైన బుధవారం ఆలయం చుట్టూ రథాన్ని ప్రదక్షిణ చేపట్టి గ్రామంలోకి తీసుకొస్తున్న సమయంలో రోడ్డుపై ఉన్న 11 కేవీ విద్యుత్ తీగలు రథంపై పడింది. ఈ ఘటనలో నలుగురు విద్యుదాఘాతానికి గురికాగా వీరిని అంబులెన్స్‌లో బోధన్ ఆసుపత్రికి తరలించారు. కోటగిరి మండలం సుంకిని గ్రామానికి చెందిన మాధవరావు (20) మేనమామ నివాసమైన అంబం గ్రామానికి ఉత్సవాలకు హాజరు కాగా విద్యుదాఘాతంతో మృతి చెందాడు. అంబం గ్రామానికి చెందిన కుర్లెపు గంగాధర్, కుర్మ పోశెట్టి, శివకుమార్‌కు గాయాలు కావడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. దీంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

ట్రాక్టర్ బోల్తాపడి ఒకరి మృతి

బోధన్‌రూరల్: ట్రాక్టర్ బోల్తాపడిన ఘటనలో ఒకరు మృతి చెందినట్లు ఎస్సై నాగనాథ్ తెలిపారు. మండలంలోని పెంటకుర్దు గ్రామానికి చెందిన భాస్కర్‌రెడ్డి వేరొకరి ట్రాక్టర్‌ను రిపేర్ కోసం బోధన్‌కు తీసుకెళ్తుండగా ప్రమాదవశాత్తు పెంటకుర్దులో బోల్తాపడింది. ఈ ఘటనలో భాస్కర్‌రెడ్డిపై ట్రాక్టర్ వెనుకభాగం పడడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. బాధిత కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



భాస్కర్‌రెడ్డి (ఫైల్)

పేదరికమే ప్రాణం బలిగొంది

- జ్వరంతో బాలుడి మృతి



నరేశ్ ఒడిలో కొడుకు చందు మృతదేహం

బాల్కొండ: పేదరికం కన్న కొడుకు ప్రాణాన్ని బలితీసుకుంది. కొడుకు జ్వరంతో అవస్థ పడుతుంటే మంచి ఆస్పత్రిలో చూపించలేని పరిస్థితి. స్థానిక ఆర్‌ఎంపీ వద్దే వైద్యం చేయించడంతో చివరికి కొడుకు తనువు చాలించాల్సి వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం నెల్లూరు జిల్లా చెన్నైపాలెం కు చెందిన నరేశ్ 20 రోజుల క్రితం కుటుంబంతో సహా నిజామాబాద్ జిల్లా బాల్కొండ మండలం ఇత్వార్‌పేట్‌కు వచ్చి శివారులో గల ఇటుక బట్టీల్లో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ఆయన కుమారుడు చందు(5) వారం రోజుల నుంచి ట్రాన్సిల్స్‌తో (గదవ బిల్లలు) జ్వరం రాగా బాధపడుతున్నాడు. చందును స్థానిక ఆర్‌ఎంపీ వద్ద వైద్యం చేయించారు. ఎంతకీ జ్వరం తగ్గక పోవడంతో నరేశ్ కుమారుడిని బుధవారం బాల్కొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే చందు అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. చేతిలో డబ్బు లేకపోవడంతో కుమారుడి శవంతో నరేశ్ ఆస్పత్రిలో బాధపడుతుండగా గమనించిన స్థానికులు తోచిన ఆర్థిక సహాయం చేశారు. నరేశ్ కుమారుడి శవాన్ని స్వగ్రామానికి తీసుకెళ్లాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ఎమ్మెల్యే షకీల్ ప్రచారంలో ఉద్రిక్తత



కాంగ్రెస్ మండలాధ్యక్షుడు పులి శ్రీను తదితరులపై లాఠీ ఝుళిపిస్తున్న సీఐ శ్రీనివాసరాజు



ఇరువర్గాల కార్యకర్తలను చెదరగొడుతున్న పోలీసులు

- పలు గ్రామాల్లో ప్రచారాన్ని అడ్డుకున్న కాంగ్రెస్, బీజేపీ నాయకులు
- ప్రతిఘటించిన బీఆర్‌ఎస్ శ్రేణులు

ఎడపల్లి: మండలంలో బోధన్ బీఆర్‌ఎస్ అభ్యర్థి మహ్మద్ షకీల్ ఆమేర్ ప్రచారంలో ఉద్రిక్తత నెలకొంది. బుధవారం షకీల్ అంబం(వై), ఏఆర్‌పీ క్యాంప్ గ్రామాల్లో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతుండగా కొందరు మహిళలు, గ్రామ ప్రజలు తమ సమస్యలపై ప్రశ్నించారు. ఈ క్రమంలో బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య తోపులాట చోటుచేసుకుంది. అనంతరం మండలంలోని బ్రాహ్మణపల్లిలో ఎమ్మెల్యే ప్రసంగిస్తుండగా గ్రామానికి చెందిన కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలు సమస్యలపై నిలదీసే ప్రయత్నం చేయగా బీఆర్‌ఎస్ కార్యకర్తలు అడ్డుకున్నారు. దీంతో వారు షకీల్ వాహనాలు ముందుకు వెళ్లకుండా అడ్డు తగిలారు. ప్రచార వాహనాలకు అడ్డంగా పడుకొనే యత్నం చేయగా బీఆర్‌ఎస్ నాయకులు వారిని లాగేసి వాహనాలను కదిలించారు. అనంతరం జైతాపూర్‌లో కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలు ఎమ్మెల్యే వాహనాన్ని అడ్డుకొనే యత్నం చేయగా బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలకు తోపులాట జరిగి ఘర్షణ చోటు చేసుకుంది. ఈ క్రమంలో సింగిల్ విండో చైర్మన్ సత్యనారాయణ, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు శ్రీరామ్ ఒకరిపై ఒకరు చేయి చేసుకున్నారు. సింగిల్ విండో చైర్మన్ అనుచరులు బీఆర్‌ఎస్ నాయకులు నాగేందర్ రెడ్డి, రామకృష్ణరెడ్డిపై చేయి చేసుకున్నారు. ఈ ఘటనపై స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడం వారు రంగప్రవేశం చేసి ఇరువర్గాలను చెదరగొట్టారు. అనంతరం ఎమ్మెల్యే షకీల్ జంలం గ్రామంలో ప్రచారం ముగించుకొని బోధన్ వెళ్లే క్రమంలో శాటాపూర్ గేట్ వద్ద ఎమ్మెల్యే వాహనాన్ని అడ్డుకోవడానికి కాంగ్రెస్ నాయకులు గుమిగూడారు. విషయం తెలిసిన బీఆర్‌ఎస్ నాయకులు అక్కడికి వెళ్లగా ఘర్షణ చోటు చేసుకుంది. ఎడపల్లి ఉపసర్పంచ్ ఆకుల శ్రీనివాస్‌పై కాంగ్రెస్ మండలాధ్యక్షుడు పులి శ్రీనివాస్‌పై దాడి చేశారు. ఈ క్రమంలో ఇరువురికి స్వల్ప గాయాలయ్యాయి. సాటాపూర్ గేట్ వద్ద షకీల్ తన వాహనం దిగి వచ్చి మాట్లాడారు. పోలీసులు ఆయనను సముదాయించారు. బోధన్ ఏసీపీ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో ఇరువర్గాలను చెదరగొట్టారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి షకీల్ ప్రచారాన్ని అడ్డుకున్న వారిపై కేసులు నమోదు చేస్తామని ఏసీపీ తెలిపారు.

అక్రమ మద్యంపై ఉక్కుపాదం

ఖలీల్‌వాడి: జిల్లాలో అక్రమంగా మద్యం రవాణా చేసే వారిపై ఎక్సైజ్ అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద నిఘా ఏర్పాటు చేయడంతో అక్రమ మద్యం రవాణా కాకుండా అడ్డుకుంటున్నారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జిల్లా ఎక్సైజ్ శాఖ ఎన్నికల కోడ్ అమలైన నాటి నుంచి ఇప్పటివరకు 570 కేసులు నమోదు చేసినట్లు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ కె.మల్లారెడ్డి బుధవారం తెలిపారు. కేసుల్లో 233 మందిని అరెస్టు చేయగా రూ.2,24,59,664 విలువైన మద్యాన్ని పట్టుకున్నట్లు చెప్పారు. జిల్లాలో ఇప్పటి వరకు 1,42,149 లీటర్ల మద్యంతోపాటు ఇతర మత్తు పదార్థాలు, 43 వాహనాలను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. ఎన్నికలు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు ఎక్సైజ్ శాఖ కృషి చేస్తోందని అన్నారు. ఎక్సైజ్ శాఖ రాత్రి, పగలు ప్రత్యేక బృందాలతో నిఘా పెట్టి కట్టడి చేస్తున్నట్లు పేర్కొన్నారు.

గుడిసె దగ్ధం

నాగిరెడ్డిపేట: మండలంలోని ఎర్రకుంటతండాలో పాలమూరు శారదకు చెందిన నివాసపు గుడిసె మంగళవారం రాత్రి దగ్ధమైనట్లు ఎస్సై రాజు తెలిపారు. శారదకు అదే తండాకు చెందిన కొందరితో గొడవ ఉండడంతో వారు తమ గుడిసెను దగ్ధం చేసినట్లు బాధితురాలు ఆరోపించింది. శారద ఫిర్యాదు మేరకు తండాకు చెందిన పలువురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES
■ షూరిటీ, సెక్యూరిటీ, వ్యక్తిగత, వ్యాపార, వ్యవసాయంపై అతి తక్కువ వడ్డీతో రుణం ఇవ్వబడును. Mr. Rohit Wonder Capital PH: 9041114468 [W-788952]

Finance Services
■ సిరి అసోసియేట్స్ అన్ని రకాల రుణాలు, పర్సనల్ హౌసింగ్ మార్ట్ గేజ్ ఓపెన్ ప్లాట్స్ పై కూడా సివిల్ ప్రాబ్లం ఉన్న చేయించబడును. సంప్ర: సెల్: 9666142226. [W-1200958]

OLD AGE HOME
■ ఒమేగా హోంకేర్ వంట/ఇంటి పనిచేయుటకు, వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను 24 గం॥లు చూసుకొనుటకు మీ ఇంటికే కేర్‌టేకర్స్‌ని పంపబడును. హైదరాబాద్. Ph: 8977639664 / 8977639665. [H-793653]

WANTED
■ Wanted E/M Lady Teachers to Teach up to Vth English, Maths & EVS, Salary Negotiable (School Bus Facility for Staff) Just 10 KM from Nzb. Interview: 28-11-23 (Tuesday), Cell: 9989448828. [Z-799651]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 200/-రూ॥లు ప్రతి అదనపు లైను 50/-రూ॥లు మాత్రమే

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి నిజామాబాద్ CONTACT: 9492010949

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.